సాక్షి ప్రకాశం

ఆదివారం । 21 । జూన్ । 2026

నల్లమల నిండా..ప్లాస్టిక్ వ్యర్థాలే..

నల్లమల అభయారణ్యంలోని రహదారి అంతా ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. శ్రీశైల మార్గం పొడవునా కుప్పలు కుప్పలుగా ప్లాస్టిక్ పేరుకుపోయింది. - 8లో..

జిల్లాలో పెరిగిన పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో ప్రస్తుతం పోలింగ్ కేంద్రాలు పెరిగాయని జిల్లా ఇన్‌చార్జ్ డీఆర్వో మాధురీలత వెల్లడించారు. - 8లో..

ఉష్ణోగ్రతలు

	గరిష్టం	కనిష్టం
ఒంగోలు	36	28
మార్కాపురం	36	28
కనిగిరి	36	28

ఫీజుల బండబడి..

చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమయ్యాయి. విధిలేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు స్థోమత లేకపోయినా పిల్లలకు మంచి చదువు దక్కుతుందన్న ఆశతో ప్రైవేటు పాఠశాలల్లో చేర్చుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు ఫీజుల దోపిడీకి తెరతీశాయి. వేలాది రూపాయల ఫీజులకు తోడు యూనిఫాం, బుక్స్, యాక్టివిటీ ఫీజుల పేరుతో ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. కరువు కాలంలో పనులు లేక అల్లాడుతున్న తల్లిదండ్రులకు ఈ ఫీజుల దోపిడీ మరింత పెనుభారంగా మారింది. ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం విఫలమవడంతో ప్రైవేటు స్కూళ్ల దోపిడీకి అడ్డూఅదుపూ లేకుండా పోతోంది.

- ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీ
- యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, యాక్టివిటీ ఫీజుల పేరుతో మరింత బాదుడు
- యూనిఫాం, బుక్స్ తాము చెప్పిన చోటే కొనాలనే నిబంధన
- కరువు కష్టాలకు తోడు ఫీజుల దెబ్బతో పెనుభారం
- అప్పులపాలవుతున్న తల్లిదండ్రులు
- ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం విఫలం



ప్రకాశం జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు: 443

ఒంగోలు సిటీ/మార్కాపురం:

విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల భారం విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలు పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణపై మార్గదర్శకాలు ఉన్నాయని చెబుతున్నా, ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూనే ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకంటే దీటుగా తీర్చిదిద్దారు. విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు, షూలు, టై, బెల్టులు, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు ఇచ్చేవారు. ఫీజు రెగ్యులేటరీ కమిటీని ఏర్పాటు చేసి ప్రైవేటు పాఠశాలలపై నిఘా పెట్టేవారు. దీంతో తమ పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్య లభిస్తుందన్న ఆశతో అప్పటికే ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులపైనా నియంత్రణ ఉండేది.

నేడు ఇలా..

చంద్రబాబు ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైంది. రెండేళ్లుగా నాడు-నేడు పథకం కింద అసంపూర్తిగా మిగిలిన పాఠశాలలను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. విద్యార్థులు అరకొర వసతుల మధ్య ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కొనసాగిస్తున్నారు. దీంతో తమ పిల్లలకు మెరుగైన విద్య దక్కుతుందన్న ఆశతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దోపిడీతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు..

ఒకటో తరగతి విద్యార్థికే రూ.30 వేలకు పైన, పదో తరగతి విద్యార్థికి రూ.70 వేల నుంచి లక్ష రూపాయిల వరకు వసూలు చేస్తున్న పాఠశాలలు చాలా ఉన్నాయి. గత ఏడాది మూడో తరగతికి రూ.40 వేలు ఉంటే ఈ సంవత్సరం ఫీజు రూ.50 వేలుకు అంటే రూ.10 వేలు పెంచుతున్నారు. ఒక్కో తరగతికి రూ.10 వేలు చొప్పున పెంచుతున్నారు. ప్రకాశం జిల్లాలో 443 ప్రైవేట్ పాఠశాలలు ఉండగా, మార్కాపురం జిల్లాలో 230 ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అడ్మిషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా ఖర్చులు కలిపి తడిసి మోపెడవుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

వారి దగ్గరే యూనిఫాం, బుక్స్ కొనాలి..

నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు సుమారు రూ.10 నుంచి రూ.15 వేలు పుస్తకాలకు, మరో రూ.5 వేలు యూనిఫాం కింద తల్లిదండ్రుల వద్ద నుంచి వసూలు చేస్తున్నారు. దీంట్లోనే 50 శాతం మేర ఆదాయం వస్తోంది. మరికొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, తమ స్కూల్‌డ్రస్, పుస్తకాలను షాపులకు కాంట్రాక్టు ఇవ్వడంతో ఆయా స్కూల్స్ యూనిఫారాలు అక్కడ మాత్రమే దొరుకుతున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆ షాపుల్లోనే వారు చెప్పిన ధరకే అవి ధరకు తగ్గ నాణ్యత లేకపోయినా కొనాల్సి వస్తోంది. ప్రైవేటు పాఠశాలలకు పుస్తకాలు, స్టేషనరీతో అదనపు ఆదాయం వస్తోంది. జూనియర్ కళాశాలల్లో కూడా ఇదే తంతు కొనసాగుతోంది. జిల్లా మొత్తం మీద సుమారు 130 జూనియర్ కళాశాలలు ఉండగా ఇందులో సుమారు 60 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. లక్షల రూపాయల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు.

ఫీజుల నియంత్రణ ఎక్కడ?

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల పెంపుపై పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థలు సమర్థవంతంగా పని చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధిక ఫీజులపై ఫిర్యాదులు చేసినా పరిష్కారం లభించడం లేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం నిబంధనలు తీసుకొచ్చినా వాటి అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోంది. జిల్లా స్థాయి అధికారులు ఫీజుల నిర్మాణం, అదనపు వసూళ్లు, మెస్ చార్జీలు, ప్రత్యేక కోర్సుల పేరుతో జరుగుతున్న దోపిడీ పై సమగ్రంగా పరిశీలించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్పొరేట్ పాఠశాలల ఫీజులపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలి. మెస్ ఛార్జీలు, అదనపు వసూళ్లపై పారదర్శకత తీసుకురావాలి.

ఫీజుల నియంత్రణకు ప్రత్యేక కమిటీ వేయాలి:

ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, ప్రతి పాఠశాల ఫీజు వివరాలను బహిరంగంగా ప్రకటించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యను వ్యాపారంగా కాకుండా సేవగా చూడాలని, అధిక ఫీజులపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్కూళ్ల దోపిడీపై ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కరువు కష్టాల్లో ఫీజుల భారం..

ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో వరుసగా కరువు పరిస్థితులు నెలకొనడం, వ్యవసాయ దిగుబడులు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో గ్రామీణ కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోంది. వ్యవసాయంపైనే ఆధారపడిన అనేక కుటుంబాలు ఆదాయం తగ్గిపోవడంతో నిత్యావసర ఖర్చులకే ఇబ్బందులు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లల చదువుల కోసం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న భారీ ఫీజులు అదనపు భారంగా మారాయి. పిల్లల భవిష్యత్తు కోసం విధి లేక బంగారం తాకట్టు పెట్టడం, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకోవాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. కరువు ప్రభావంతో ఆదాయం తగ్గిన నేపథ్యంలో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉపశమనం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫీజుల నియంత్రణ చర్యలు తీసుకోవాలి

విద్యాశాఖ మంత్రి ఫీజుల వివరాలను ప్రతి పాఠశాల నోటీసు బోర్డులో బహిరంగంగా ప్రదర్శించాలని ప్రకటించినా క్షేత్ర స్థాయిలో ఆ ఆదేశాలు అమలు కావడం లేదు. అనేక ప్రైవేటు పాఠశాలలు ఇప్పటికీ అధిక ఫీజులు వసూలు చేస్తూ, పుస్తకాలు, విద్యాసామగ్రిని పాఠశాలల్లోనే విక్రయిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం పెరుగుతోంది. సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యను వ్యాపారంగా మార్చకుండా చూడాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

– వినోద్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి

పెంచిన ఫీజులు తగ్గించాలి

ఈ విద్యా సంవత్సరంలో పలు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల స్కూల్ ఫీజులను తమకు ఇష్టం వచ్చినట్టుగా భారీగా పెంచాయి. ప్రతి ఏడాది స్కూల్ ఫీజులు పెంచడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే సమయంలో స్కూల్ బుక్కులు, యూనిఫాంలు కూడా వారివద్దనే కొనాలనే నిబంధన పెట్టారు. ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. విద్యాశాఖ అధికారులు ప్రైవేటు విద్యాసంస్థలను తనిఖీ చేసి పెంచిన ఫీజులు తగ్గించడంతోపాటు స్కూల్ పుస్తకాలు, యూనిఫాంను తమకు ఇష్టమైన చోట కొనుగోలు చేసుకునే అవకాశం ఇవ్వాలి. దీంతోపాటు ప్రైవేటు టీచర్లకు కూడా కనీస వేతనాలను అమలు చేయాలి.

– విజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

మార్కాపురం జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు: 230

విద్యావ్యవస్థపై సరైన నియంత్రణ లేదు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చేశాయి. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థపై సరైన నియంత్రణ లేకపోవడంతో అధిక ఫీజులు వసూలు చేయడంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజుల నియంత్రించడంలో కఠిన చర్యలు తీసుకోవాలి.

– పల్నాటి రవీంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

పొగాకు రైతుల కోసం ధర్నాకు సిద్ధం

- సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున

మేరుగు నాగార్జున

మద్దిపాడు: జిల్లాలోని పొగాకు రైతులకు మద్దతుగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ధర్నాలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. పొగాకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, వారిని ప్రభుత్వం ఆదుకోకుండా మీన మేషాలు లెక్కిస్తోందని విమర్శించారు. సుమారుగా ఎకరాకు దున్నకాలు, నారు, నాట్లు కూలి ఖర్చులు పొగాకు కాల్చడం, రవాణా ఇలా అన్ని ఖర్చులు కలుపుకుని సుమారు రూ.2 లక్షల వరకూ అవుతుందని, దీనికి తోడు మధ్యలో వర్షం పడి పొగాకు పంట పోతే మళ్లీ నాట్లు వేస్తారని, దీనికి అదనంగా మరో రూ.20 వేల వరకూ ఖర్చు వస్తుందన్నారు. ఒక బ్యారన్ వేసే రైతుకు రూ.20 లక్షల వరకూ ఖర్చు వస్తుందన్నారు. రైతు 80 క్వింటాళ్ల పొగాకు పండిస్తే అందులో సుమారు 50 శాతం మేలిమి రకం పొగాకు దిగుబడి అవుతుందని, మిగిలిన 50 శాతం బ్రౌన్, గ్రీన్ టాప్‌లీఫ్, మాడు వస్తాయని పొగాకు మొత్తాన్ని సరాసరిన కేజీ రూ.250 పైన కొనుగోలు చేస్తే రైతు అప్పులే కుండా బయపడతాడన్నారు. కానీ వ్యాపారులు మాత్రం మేలిమి రకం పొగాకునే రూ.170 నుంచి రూ.200 లోపు కొనుగోలు చేస్తున్నారన్నారు. మేలిమి రకం పొగాకునే ఇంత తక్కువ ధరకు కొనుగోలు చేస్తే మిగిలిన 50 శాతం ఎఫ్ 5 రకం పొగాకును వీరు ఎంతకు కొనుగోలు చేస్తారో ఊహించవచ్చన్నారు. పొగాకు కొనుగోళ్లు ఇలాగే సాగితే బ్యారన్‌కు రూ.4.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ నష్టం వాటిల్లుతుందని ఆయన వివరించారు. ఇలా కొనుగోలు చేయడం వలన పొగాకు రైతులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు రైతులను ఆదుకోవడానికి రూ.300 కోట్లతో మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి కొనుగోలు చేయించారని గుర్తు చేశారు. చంద్రబాబుకు రైతులన్నా, వ్యవసాయమన్నా చులకన భావం ఉందని, అందుకే వారికి రైతులకు సహాయం చేద్దామన్న ఆలోచన ఉండదని విమర్శించారు. చంద్రబాబు కేజీ రూ.200లకు తగ్గకుండా కొనుగోలు చేయమని చెబుతున్నారని కానీ వేలం కేంద్రాల్లో ముఖ్యమంత్రి చెప్పినట్లు కొనుగోళ్లు జరగడం లేదన్నారు. కార్పొరేట్లకు దోచి పెట్టడమే పరమావధిగా పెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతుల కష్టాలు ఏం తెలుస్తాయని ఆయన విమర్శించారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు కొనుగోలు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను విస్మరించిన ఏ ప్రభుత్వం మనలేదన్నారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకపోతే అన్ని పార్టీలు ప్రజా సంఘాలను కలుపుకుని ధర్నా చేయడానికి కూడా వెనుకాడమని మేరుగు నాగార్జున హెచ్చరించారు.

తప్పులు మీరు చేసి మాపై కేసులా..?

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి

నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: తప్పులు మీరు చేసి ఆ తప్పులు పక్కదారి పట్టించేందుకు కేసులు మాత్రం మా నాయకులపై పెడుతున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. లిక్కర్ స్కాం కేసులో కారుమూరి సునీల్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి అనంతరం నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గొంగటి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ లిక్కర్ స్కామ్ కేసులో కారుమూరి సునీల్‌ని అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కారుమూరి సునీల్‌కుగానీ, ఆయన తండ్రి కారుమూరి నాగేశ్వరరావుకు గానీ లిక్కర్ వ్యాపారంతో వారికి ఎలాంటి సంబంధం లేదన్నారు. వారికి ప్రజల్లో ఉన్న ఆదరణను తట్టుకోలేక వారిని ఈ లిక్కర్ స్కాం కేసులో ఇరికించి అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ఇలాంటి అక్రమ అరెస్టులకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులెవరూ భయపడరని చెప్పారు. వాటిపై న్యాయపోరాటం చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో మద్యం సరఫరా, విక్రయాలు పారదర్శకంగా జరిగాయన్నారు. అక్రమ మద్యాన్ని పూర్తిగా నియంత్రించడంతో పాటు ప్రభుత్వమే స్వయంగా మద్యం షాపులు నిర్వహించిందన్నారు. బెల్ట్ షాపులు, పర్మిట్ రూములు పూర్తిగా రద్దు చేశారన్నారు. అయినా మద్యం కేసు సృష్టించి పార్టీ పెద్దలను ఇరికించే కుట్ర చేస్తున్నారన్నారు. కారుమూరి నాగేశ్వరరావు కుటుంబాన్ని టార్గెట్ చేసి మద్యం రవాణాలో అక్రమాలు చేశారంటూ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. 2014-19 మధ్య మద్యం సరఫరా, విక్రయాల్లో నాటి సీఎం చంద్రబాబు ఎన్నో అక్రమాలు చేశారన్నారు. బార్లకు మేలు చేకూర్చేలా ప్రివిలేజ్ ఫీజును రద్దుచేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారని గుర్తు చేశారు. ఎంపిక చేసిన డిస్టిలరీ నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేశారన్నారు. మద్యం దుకాణాలన్నీ టీడీపీ సిండికేట్ల చేతుల్లో ఉంచుకుని పర్మిట్ రూములు, వాడ వాడలా బెల్ట్ షాప్‌లు నిర్వహించి ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించి జనాన్ని దోచుకున్నారని మండిపడ్డారు. మద్యం ఎక్కువ విక్రయాలు జరిగినా ప్రభుత్వ ఆదాయం పెరగలేదని, మద్యం సరఫరా విక్రయాల్లో అక్రమాలపై చంద్రబాబుపై ఆ తర్వాత కేసు కూడా నమోదైదన్నారు. ఇప్పుడు అధికారంలోకి రాగానే ఆ కేసును మాఫీ చేసుకోవడంతో పాటు జనం దృష్టిని మళ్లించడం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం సరఫరాలో అక్రమాలు జరిగాయంటూ లేని కేసును సృష్టించి వైఎస్సార్ సీపీ నాయకులను వేధిస్తున్నారని మండి పడ్డారు. కార్యక్రమంలో కురిచేడు, ముండ్లమూరు మండలాల కన్వీనర్లు యన్నాబత్తుని సుబ్బయ్య, చింతా శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్ రెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటు పోలయ్య, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి చైతన్య రెడ్డి, జిల్లా యువజన విభాగం కార్యదర్శి యరమల మధు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఇరుగుల శ్రీనివాసరెడ్డి, యువజన విభాగం కురిచేడు మండల అధ్యక్షుడు శివారెడ్డి, యువజన విభాగం తాళ్లూరు మండల అధ్యక్షుడు విష్ణు చౌదరి, యువజన విభాగం దర్శి మండల అధ్యక్షుడు బాబు, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు మేడగం బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేడు ఒంగోలులో 6 సెంటర్లలో పరీక్ష నిర్వహణ
- హాజరుకానున్న 1821 మంది అభ్యర్థులు
- పరీక్ష హాలులోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధం
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఒంగోలు సిటీ: నగరంలో ఆదివారం జరిగే ''నీట్'' పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. పరీక్షలు జరిగే ఒంగోలులోని 6 సెంటర్లను ఎస్పీ వి.హర్షవర్ధన రాజుతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. నవోదయ, కేంద్రీయ విద్యాలయం, దామచర్ల ఆంజనేయులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, డీఆర్ఆర్ఎం పాఠశాల, పీవీఆర్ బాలుర పాఠశాలలను ఈ పరీక్షకు ఎంపిక చేశారు. వీటితోపాటు ప్రశ్న పత్రాలను భద్రపరిచే కర్నూలు రోడ్డులోని భారతీయ స్టేట్ బ్యాంకులోని లాకర్ సదుపాయాన్ని కూడా వీరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్ పరీక్షకు 1821 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు. ఎన్‌టీఏ ఆదేశాల మేరకు మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమన్నారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేందుకు ఆయా కేంద్రాల్లో అవసరమైన పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్య శిబిరం, అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా రవాణా సదుపాయం వంటి మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించినట్లు తెలిపారు. ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించామన్నారు. మొత్తం ఆరు కేంద్రాలను రెండు జోన్లుగా విభజించి, మరింత భద్రత పర్యవేక్షణ కోసం ప్రతి జోనుకు అదనంగా ఇన్‌స్పెక్టర్‌ను కూడా కేటాయించామన్నారు. ఒంగోలుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్టాండ్, రైల్వే స్టేషన్లలో కూడా పోలీసుల ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అనుమానాస్పదంగా వ్యవహరించినా లేదా నిబంధనలను ఉల్లంఘించేందుకు ప్రయత్నించినా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ పరీక్షా కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగినా వెంటనే డయల్-100/112 లేదా జిల్లా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా వీరి వెంట డీఆర్‌ఓ మాధురి, ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, పరీక్షల కోఆర్డినేటర్, కేంద్రీయ విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ మనీష్‌తో పాటు ఇతర అధికారులు ఉన్నారు.

సర్పంచుల బిల్లుల చెల్లింపులకు గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలి

ఒంగోలు టౌన్: ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని గ్రామ పంచాయతీల్లో చేసిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల విషయంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జీ.వీరభద్రాచారి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం సర్పంచులు ఆయా గ్రామాల్లో అనేక పనులు చేశారని, అయితే వాటికి సంబంధించిన పనుల బిల్లులు చెల్లించకుండా అనేక మంది ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు సర్పంచులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొరిశపాడు మండలం రావినూతలలో ఎస్సీ మహిళా సర్పంచ్‌ను బిల్లులు మంజూరు చేయకుండా వేధిస్తున్నారని, ఇక్కడ కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తున్నారని తెలిపారు. కార్యదర్శులు, ప్రత్యేక అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తగిన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విధంగా ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో అనేక మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా సర్పంచులు సకాలంలో బిల్లులు రాక ఆర్థికంగా చితికిపోతున్నారని తెలిపారు.

క్లుప్తంగా

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

అరెస్టు చేసిన వ్యక్తి, మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ పోలీసులు

చీమకుర్తి రూరల్: అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చీమకుర్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సీఐ సుకన్య తెలిపారు. శనివారం చీమకుర్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సంతనూతలపాడు మండలం కొనగానివారిపాలెంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నల్లమోతు శ్రీనివాసరావు నుంచి 10 బాటిళ్లు స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

వందేభారత్ రైలు ఢీకొని వ్యక్తి మృతి

మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

టంగుటూరు: వందేభారత్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన టంగుటూరులోని ఎల్‌సీ 191 గేటు ఉత్తరం వైపు శనివారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ టి.శ్రీరామ్ తెలిపిన వివరాల మేరకు.. సుమారు 30 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తిని వందేభారత్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడు మెరూన్ కలర్ అరచేతుల నెక్ టీ షర్ట్, నీలిరంగు జీన్స్ ప్యాంటు, కుడిచేతికి కడియం ధరించి ఉన్నాడు. ఎత్తు సుమారు 5.5 అడుగులతో చామన చాయలో ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని శ్రీరామ్ కోరారు.

23న జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

ఒంగోలు: ప్రకాశం జిల్లా అండర్ 19, అండర్ 23, సీనియర్ మహిళా క్రికెట్ జట్లను ఈ నెల 23వ తేదీ ఎంపిక చేయనున్నట్లు ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని క్రీడాకారులు అర్హులని అన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 8.30 గంటలకు స్థానిక మంగమూరు రోడ్డులోని అసోసియేషన్ సబ్ సెంటర్‌లో జరిగే ఎంపికకు నేరుగా హాజరుకావాలని సూచించారు. క్రీడాకారులు తప్పనిసరిగా కలర్ డ్రస్, షూ, సొంత కిట్, జనన ధ్రువీకరణ పత్రం (ఫారం 5), ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని కోరారు. ఎంపికైన జట్లు జూలైలో మంగళగిరి, పేరేచర్లలో జరిగే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు కోచ్ పి.శ్రీనివాస్ (9573424360), బి.చంద్రశేఖర్ (9246222999)ను సంప్రదించాలని నాగేశ్వరరావు తెలిపారు.

నల్లమల నిండా.. ప్లాస్టిక్ వ్యర్థాలే!

- స్వచ్ఛ సేవకులకు ఇతర పనులు అప్పగించిన అధికారులు
- శ్రీశైలం మార్గం పొడవునా పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్న మూగజీవాల్లో జీర్ణకోశ వ్యాధులు

నల్లమలలో కుప్పలుగా పడి ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు

పెద్దదోర్నాల: ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా నిన్నమొన్నటి వరకు కళకళలాడిన నల్లమల అభయారణ్యం ఇప్పుడు కళావిహీనంగా మారింది. ప్లాస్టిక్ వ్యర్థాలు, తినుబండారాల కవర్లు, తదితర వాటితో ప్రస్తుతం నల్లమల అభయారణ్యంలోని రహదారులు నిండిపోయాయి. ఒకప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లను రోడ్లపై పడేస్తే జరిమానాలు విధిస్తూ యాత్రికులకు ముచ్చెమటలు పట్టించిన అటవీ శాఖ ఉన్నతాధికారులు ఇప్పుడు ఆ సంగతే మరిచారు. దీంతో పాటు గణపతి చెక్‌పోస్టు వద్ద శ్రీశైలం వెళ్లే పర్యాటకుల నుంచి నీటి బాటిళ్లను బలవంతంగా తీసుకున్న అధికారులు.. నేడు ఆ నిబంధనలను గాలికి వదిలేశారు. ప్రయాణికులు, యాత్రికులు పారవేసే ప్లాస్టిక్ నీటి బాటిళ్లు, రేపర్లలో ప్యాక్ చేసిన తినుబండారాల ప్యాకెట్లను ఏరేసే స్వచ్ఛ సేవకులకు 15 రోజులుగా ఇతర పనులు అప్పగించి చోద్యం చూస్తున్నారు. దీంతో అటవీ ప్రాంతంలోని రహదారులు ప్లాస్టిక్ వ్యర్థాలు, రేపర్లలో ప్యాక్ చేసిన తినుబండారాల ప్యాకెట్లతో పూర్తిస్థాయిలో నిండి శ్రీశైలం వెళ్లే యాత్రికులకు చికాకు కలిగిస్తున్నాయి.

సీడ్‌బాల్స్ తయారీలో స్వచ్ఛ సేవకులు...

నల్లమల అభయారణ్యంలో విధులు నిర్వహించే స్వచ్ఛ సేవకులు గత నెల 3వ తేదీ నుంచి వారి విధులకు హాజరు కాకుండా ఉన్నతాధికారుల అదేశాల మేరకు సీడ్‌బాల్స్ తయారీ పనుల్లో బిజీగా మారారు. సీడ్‌బాల్స్ తయారీ మంచి కార్యక్రమమే అయినప్పటికీ స్వచ్ఛ సేవకులు 15 రోజులుగా విధులకు హాజరుకాకపోవడంతో రోడ్లకు ఇరువైపులా ప్లాస్టిక్ బాటిళ్లు వేలాదిగా పేరుకుపోవడంతో నల్లమలలోని వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. సాధారణంగా సీడ్‌బాల్స్ తయారీని స్వచ్ఛంద సంస్థలు లేదా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కూలీల ద్వారా చేయించాల్సి ఉంది. నిరంతరం రోడ్లపై చెత్త, ప్లాస్టిక్‌ను ఏరివేసే స్వచ్ఛ సేవకులను సీడ్‌బాల్స్ తయారీకి వినియోగించటం ఎంత వరకు సబబని పర్యావరణ ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు.

వన్యప్రాణులకు ప్రాణహాని...

శ్రీశైలం వచ్చే భక్తులు, యాత్రికులు సాధారణంగా మార్గమధ్యంలో భోజనం, అల్పాహారాలు చేయడంతో పాటు నీటి బాటిళ్లు, ప్లాస్టిక్ రేపర్లలో ప్యాక్ చేసిన తినుబండారాలను కొనుగోలు చేస్తుంటారు. అలా కొనుగోలు చేసిన ఆహార పదార్థాల వ్యర్థాలను, ప్లాస్టిక్ కవర్లను, నీటి బాటిళ్లను మార్గమధ్యంలో అభయారణ్యంలోని రోడ్లపై విసిరేస్తుంటారు. అలా సగం తిని వదిలేసిన తినుబండారాలను నల్లమలలో సంచరించే మూగజీవాలు తింటాయి. అవి వ్యర్థాలను తినటంతో మూగజీవాల జీర్ణవ్యవస్థలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకొని వాటి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు అభయారణ్యంలో పేరుకుపోయిన ప్లాస్టిక్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నల్లమలలో రోడ్డు పక్కన పడి ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లు

సీడ్ బాల్స్ తయారీలో అటవీ సిబ్బంది

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యానంద్

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యానంద్

ఒంగోలు:

జాతీయ లోక్ అదాలత్ జూలై 11న జరుగుతుందని, అందులో జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ.సత్యానంద్ కోరారు. శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లో బ్యాంకు అధికారులు, సంబంధిత బ్యాంకుల న్యాయవాదులతో జాతీయ లోక్ అదాలత్‌పై ఆయన చర్చించారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేందుకు బ్యాంకు అధికారులు కూడా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి టి.రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి.పల్లవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీ రామకృష్ణ, న్యాయవాదులు బొడ్డు రామలింగం, రహీంబేగ్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పెరిగిన పోలింగ్ కేంద్రాలు

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ మాధురీలత సమావేశం

ఒంగోలు సబర్బన్:

జిల్లాలో ప్రస్తుతం పోలింగ్ కేంద్రాలు పెరిగాయని జిల్లా ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ మాధురీలత వెల్లడించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో 1649 పోలింగ్ స్టేషన్లు కాస్తా 1725 పోలింగ్ స్టేషన్లకు పెరిగాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 76 పెరిగాయన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో 259 నుంచి 2718.. అనగా 12 పోలింగ్ స్టేషన్లు పెరిగాయన్నారు. ఓటు నమోదు చేసుకునేటప్పుడు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, బీఎల్‌వోలు అడిగిన నమోదు పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు దామరాజు క్రాంతికుమార్ మాట్లాడుతూ జిల్లాలో, ఒంగోలు నగరంలో డోర్ నంబర్లు కొన్ని చోట్ల వెయ్యలేదని, సర్ కార్యక్రమం ఏ విధంగా చేస్తున్నారని ప్రశ్నించారు. సర్ కార్యక్రమంలో అధికార పార్టీ వారి ప్రలోభాలకు లొంగి నిజమైన ఓటర్లను తొలగిస్తే ఆ ఓటరు భారతదేశ పౌరసత్వం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఓటరును 2 ఫొటోలు అడుగుతున్నారని, ప్రతి ఓటరు తమ ఫొటోలు ఫొటో స్టూడియోకెళ్లి తీయించుకొని ఇవ్వాలంటే రూ.300 ఖర్చవుతుందని, ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి రూ.300 చొప్పున చెల్లించి అందరూ ఫొటోలు తీయించుకునే పరిస్థితి లేదని డీఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ భారాన్ని ఓటరు భరించే పరిస్థితి లేనందున ఎన్నికల సంఘం ఫొటోగ్రాఫర్‌ను పెట్టి ఫొటోలు తీసే కార్యక్రమం చేపట్టాలని కోరారు. ఒక కుటుంబంలో చనిపోయిన వారుంటే వారి ఓటు తొలగించడానికి డెత్ సర్టిఫికెట్ అడుగుతున్నారని, ప్రస్తుతం ఒక డెత్ సర్టిఫికెట్ తెచ్చుకోవాలంటే ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.10 వేల నుంచి రూ.15 వేల లంచం ఇవ్వందే వచ్చే పరిస్థితి లేదని అన్నారు. డెత్ సర్టిఫికెట్ లేకుండానే చనిపోయిన వారి ఓట్లను తొలగించే ఏర్పాట్లు చేయాలని క్రాంతికుమార్ కోరారు.

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ మాధురీలత

పశువులకు కృత్రిమ గర్భధారణ మేలు

- ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొత్తపట్నం: పశువులకు మేలైన కృత్రిమ గర్భధారణ చేయడం వలన రైతుకు ఆర్థికంగా లాభం చేకూరడమే కాకుండా పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్యకార్యనిర్వహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కొత్తపట్నం మండలంలోని ఆలూరు గ్రామంలో శనివారం లింగనిర్ధారిత వీర్యం ద్వారా గర్భం దాల్చిన చూడి పశువుల ప్రదర్శన నిర్వహించి రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పశుసంవర్ధకశాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వారు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించడం వలన 90 శాతం కచ్చితత్వంతో కేవలం పెయ్యి దూడలే పుడతాయని, తద్వారా పాడి రైతులకు ఆర్థిక పరిపుష్టి కలుగుతుందని తెలిపారు. శాస్త్రీయ పునరుత్పత్తి విధానం ద్వారా సంతానయోగ్యమైన ప్రతి పశువుకు వ్యక్తిగత పర్యవేక్షణలో చూలు కట్టించడం, క్రమబద్ధమైన ఈతలను పొందడం ద్వారా అధిక పాల ఉత్పత్తి సాధించడానికి పశువులు కేంద్రీకృత పునరుత్పత్తి నిర్వహణ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. ప్రకాశం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి డాక్టర్ బి.మురళీకృష్ణ మాట్లాడుతూ శాస్త్రీయ పునరుత్పత్తి విధానం పాటించకపోవడం వలన యుక్త వయసుకు వచ్చిన పడ్డలు సకాలంలో గర్భం ధరించకపోవడం, పశువుల ఈతల మధ్య వ్యవధి పెరగడం వలన పాడి రైతులకు ఆర్థికంగా నష్టం కలుగుతుందని తెలిపారు. త్రోవగుంట పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.బసవశంకరరావు మాట్లాడుతూ ఈనిన ప్రతి పశువుతో మళ్లీ 45 నుంచి 60 రోజుల్లోగా శాస్త్రీయంగా చూలు కట్టించి ఈతల మధ్య వ్యవధి తగ్గించడం ద్వారా పాడి వైతులకు ఆర్థిక స్వావలంబన కలుగుతుందని తెలిపారు. పశు ప్రదర్శనలో మండలంలోని ఆలూరు, గాదెపాలెం, బీరంగుంట, గుత్తికొండవారిపాలెం గ్రామాలకు చెందిన లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ పొందిన 68 చూడి పశువులను ఉంచారు. పాడి రైతులకు బలవర్ధక మందులు, ఖనిజ లవణ మిశ్రమం, కాల్షియం, టానిక్, నట్టల నివారణ మందులు, పాల క్యాన్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఒంగోలు డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.జగత్ శ్రీనివాస్, ప్రాంతీయ పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఒంగోలు ఉపసంచాలకులు డాక్టర్ సంధ్య, పశువుల ఉత్పత్తి కేంద్రం చదలవాడ సంచాలకులు డాక్టర్ బి.రవి, ఈతముక్కల, అల్లూరు, యరజర్ల పశువైద్యాధికారులు సీహెచ్ అమూల్య, ఎం.సోమశేఖర్, డాక్టర్ వై.భూపాల్, డాక్టర్ యు.ఆశ, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్లు కె.లక్ష్మయ్య, టీవీ రమణమ్మ, కొత్తపట్నం, ఒంగోలు మండలాల పశువైద్య సిబ్బంది, వివిధ కంపెనీల ఫార్మ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలూరులో పశు ప్రదర్శనలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

స్కూల్ బస్సు - బైకు ఢీకొని వ్యక్తి మృతి

కురిచేడు:

స్కూల్ బస్సు - బైకు ఎదురెదురుగా ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన కురిచేడులోని దర్శి రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయం ఎదురుగా శనివారం చోటుచేసుకుంది. కురిచేడు మండలంలోని నమశ్శివాయపుర అగ్రహారం గ్రామానికి చెందిన బరిగే బాలయ్య (62) దర్శి రోడ్డులోని పెట్రోలు బంకులో తన ద్విచక్ర వాహనానికి పెట్రోలు పోయించుకుని వస్తున్నాడు. అదే సమయంలో స్థానిక హాస్సేనియ పాఠశాల బస్సు కురిచేడు నుంచి దర్శి రోడ్డులోని పాఠశాలకు మళ్తోంది. రోడ్డు దాటే క్రమంలో ఎదురెదురుగా వచ్చిన బస్సు - ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో బాలయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కురిచేడులోని పోలీసుస్టేషను వెనుక వైపు నివసిస్తున్న బాలయ్యకు భార్య, వివాహమైన కుమార్తె ఉన్నారు.

బాలయ్య మృతదేహం

లైంగికదాడి కేసులో నిందితుడు అరెస్ట్

పర్చూరు (చినగంజాం): మహిళపై లైంగికదాడికి పాల్పడిన కేసులో మైనర్ అయిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పర్చూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో మార్టూరు రూరల్ సీఐ నాగభూషణం శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన సుమారు 36 ఏళ్ల యువతి తన భర్తతో కలిసి పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో నివసిస్తోంది. ప్రతిరోజూ చిలకలూరిపేట పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో కూలి పనుల కోసం ఆమె వెళ్తుంటుంది. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీ ఉదయం 8 గంటల ప్రాంతంలో ఎప్పటిలాగానే కూలి పనుల కోసం చిలకలూరిపేట గాంధీ పార్కు వద్ద ఎదురుచూస్తోంది. ఆ సమయంలో గుర్తు తెలియని యువకుడు ఆమె దగ్గరకు వచ్చి మార్టూరులోని ఒక అపార్ట్‌మెంట్‌లో శుభ్రం చేయడానికి ఆడమనిషి కావాలని చెప్పి తన మోటారు సైకిల్‌పై ఎక్కించుకున్నాడు. ఒంగోలు వైపు వెళుతూ మార్గం మధ్యలో తాతపూడి ఫ్లైఓవర్ జంక్షన్ వద్ద నుంచి సూరావారిపల్లె వైపు రోడ్డులోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెను కొట్టి కింద పడేసి లైంగిక దాడి చేశాడు. అనంతరం ఆమె సెల్ ఫోన్ లాక్కుని అక్కడి నుంచి మోటార్ సైకిల్‌పై పరారయ్యాడు. ఆ మహిళ ఆ విషయాన్ని తనకు తెలిసిన వ్యక్తికి చెప్పి అదే రోజు రాత్రి యద్దనపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒంగోలులో బైక్ చోరీ చేసి వస్తుండగా అదుపులోకి...

సీఐ నాగభూషణం శనివారం ఉదయం తన సిబ్బందితో పర్చూరులోని వై జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, లైంగిక దాడి కేసులోని నిందితుడు గతంలో ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద దొంగతనం చేసిన మోటార్ సైకిల్‌పై ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళ్తూ పోలీసులను చూసి వాహనాన్ని వెనక్కు తిప్పి పారిపోయే ప్రయత్నం చేశాడు. దీంతో అతన్ని పోలీసులు పట్టుకుని విచారించారు. సదరు యువకుడు బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన మైనర్ కాగా, ప్రస్తుతం గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెద్దపరిమి గ్రామంలో ఉంటున్నట్లు గుర్తించారు. అతడు పోలీసుల విచారణలో నేరాలు అంగీకరించడంతో అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి బాధితురాలి సెల్ ఫోన్, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై పలు క్రిమినల్ కేసులున్నట్లు పోలీసులు గుర్తించారు. విలేకరుల సమావేశంలో పర్చూరు ఎస్ఐ పులిగోపి, యద్దనపూడి ఎస్ఐ డీ వెంకటరత్నం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగభూషణం, పోలీసులు

బ్యాంక్ ఆఫ్ బరోడా
Bank of Baroda

బ్యాంక్ ఆఫ్ బరోడా

టంగుటూరు బ్రాంచ్, సర్వే నెం.1245/1, డి.నెం.4-69, చెట్టిమ్మతోట, టంగుటూరు, ప్రకాశం జిల్లా - 523274, ఆంధ్రప్రదేశ్.
Ph: 89775 13982, E-mail : vjtang@bankofbaroda.com, website : www.bankofbaroda.com

స్కాన్ చేయగలరు
మరియు సంబంధిత పత్రము

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన (APPENDIX- IV-A [See proviso to Rule 8 (6) & 9 (1)])

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002తో కలిసి చదవబడే సెక్యూరిటీ ఇంటరస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) & 9(1) లోని నిబంధనలు ప్రకారం స్థిరాస్తుల అమ్మకము కొరకు అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు/ తనఖాదారుల పేర్లు మరియు చిరునామా | స్థిరాస్తి వివరములు (శ్రీమతి పులిపర్తి వెంకట శేషమ్మ గారివే తనఖా పెట్టబడినది) | మొత్తము బకాయి | ఇ-వేలం తేదీ మరియు సమయం | రిజర్వు ధర, ధరావతు మరియు బిడ్ పెంపుదల

రుణగ్రహీత: మెస్సర్స్ జగదీష్ ఎంటర్‌ప్రైజెస్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : శ్రీమతి పులిపర్తి వెంకట శేషమ్మ, చిరునామా : ఇ.నెం. 2-521, జమ్ములపాలెం గ్రామం, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా - 523274. శ్రీమతి పులిపర్తి వెంకట శేషమ్మ, మెస్సర్స్ జగదీష్ ఎంటర్‌ప్రైజెస్ యొక్క ప్రొప్రయిటర్, ఇ.నెం. 2-521, జమ్ములపాలెం గ్రామం, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా - 523274. హామీదారు : పులిపర్తి బ్రహ్మయ్య, ఇ.నెం. 2-521, జమ్ములపాలెం గ్రామం, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా - 523274.

ప్రకాశం జిల్లా, ఒంగోలు మేజర్ పంచాయతీ పరిధిలో, టంగుటూరు మండలం, జమ్ములపాలెం పంచాయతీ పరిధిలో, టంగుటూరు గ్రామం యొక్క జమ్ములపాలెం హామ్లెట్, సర్వే నెం. 603 లోని 26639.78 చదరపు అడుగుల విస్తీర్ణం గల స్థలం మరియు అందు క్రింది అంతస్తు నందు అరసెసి 846 చ.అ.లు, మొదటి అంతస్తు అరసెసి 846 చ.అ.లు మరియు క్రింది అంతస్తు నందు వసెసి షీట్ షెడ్ స్ట్రింక్ పరియా 4782.60 చ.అ.ల విస్తీర్ణంతో. టౌన్ నెం. 2-252తో గల యావత్తు ఆస్తి శ్రీమతి పులిపర్తి వెంకట శేషమ్మ గారి పేరున కలదు. హద్దులు : తూర్పు : పి. రామయ్య గారికి చెందిన ఆస్తి, పడమర : ఎన్. విజయ కుమారి గారి ఆస్తి, దక్షిణం : కొండేపి టంగుటూరు రోడ్డు, ఉత్తరం : ఎ. వెంకటసుబ్బయ్య గారి ఆస్తి.
స్వాధీనత స్వభావం : భౌతిక

తేది. 30.11.2023 నాటికి రూ. 69,88,760.69 పై (అక్షరాల అరవై తొమ్మిది లక్షల ఎనభై మూడు వేల ఏడు వందల అరవై రూపాయల అరవై తొమ్మిది పైసలు మాత్రమే) + తేది. 01.12.2023 నుంచి వర్తించిన వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి.

07-07-2026 మ॥ 02.00 గంటల నుండి సా॥ 06.00 గంటల వరకు (మేము పూర్తి ఇగు వరకు 10 నిముషముల పొడిగిన సమయం పొడిగించబడును)

రిజర్వు ధర : రూ. 1,49,38,000/- ధరావతు: రూ. 14,93,800/- బిడ్ పెంపుదల రూ. 50,000/-

అమ్మకం పూర్తి నియమనియమములు మరియు నిబంధనల కొరకు మా వెబ్ సైట్ : https://www.bankofbaroda.in/e-auction.htm నందలి మాకే ఇవ్వబడిన లింకును చూడండి మరియు ఆన్‌లైన్ వేలం పోర్టల్ https://baanknet.com కూడ చూడవచ్చును. అర్హత గల బిడ్డర్లు అధీకృత అధికారి, ఫోన్ నెం. (08592) 243561, మొబైల్ నెం. 8977513908 ను సంప్రదించగలరు.

తేది : 19-06-2026, ప్రదేశం : టంగుటూరు
సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

■ గుంటూరు సిటి, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా మరెక్కడైన ప్లాట్స్ అ/కొ॥ సంప్రః జన చైతన్య ప్లాట్స్ మా ప్రత్యేకత. 9492770739 [G-489]

FLATS FOR SALE

■ SSS హోమ్స్, ఒంగోలు కర్నూల్‌రోడ్, శ్రీ సరస్వతి కాలేజి ఎదురు నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో 2BHK ఫ్లాట్స్ (1230 SFT) కలవు. గృహప్రవేశానికి సిద్ధంగా (రెడీ టు ఆక్యూపై) ఉన్నవి. ✆ 97039 98899, 63026 75709. [O-820793]

LAND FOR SALE

■ పొదిలి మండలం పొదిలి ఊరిలో నుంచి 3 కి॥మి॥ దూరంలో 6 ఎకరాలు రోడ్డు ఫేసింగ్ భూమి అమ్మకానికి కలదు. పొదిలి నుంచి బుచ్చన్నపాలెం అడ్డరోడ్డు మీదగా రాములవేడు - దర్శి రూట్‌లో సర్వేనెంబర్ 99-1A రోడ్డు ఫేసింగ్ 480 అడుగులతో బోర్లు సౌకర్యం గల భూమి ధర ఎకరం 15లక్షలు మాత్రమే సంప్రదించ గలరు ఇట్లు B.మహేంద్ర రెడ్డి ✆ 9505195555, 9963889559. [O-820790]

HOUSE FOR SALE

■ ఒంగోలు, కర్నూల్‌రోడ్, లింగారెడ్డి అపార్ట్‌మెంట్ రోడ్డులో పడమర ఫేసింగ్ గల 3 ఫోర్లు ఇండిపెండెంట్ హౌస్ అమ్మకంనకు కలదు. SSS HOMES. ✆ 97039 98899, 63026 75709. [O-820794]

TO-LET

■ గుంటూరు RTC బస్టాండ్ ఎదురు మెయిన్ రోడ్డు నందు రన్నింగ్‌లో ఉన్న గోల్డెన్ ప్లాజా లాడ్జి అద్దెకు ఇవ్వబడును. ✆ 7661962943, 8341130758 [G-88]

Wanted

■ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజిలో పనిచేయుటకు హాస్టల్ వార్డెన్స్ బాయ్స్ & గర్ల్స్, స్టోర్‌కీజర్స్, క్యాంటిన్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీగార్డ్స్, ASO, కిచెన్ హెల్పర్స్, అటెండర్స్ కావలెను. సంప్ర॥ ✆ 9581456389, 9676706507. [O-820792]

■ ఒంగోలులోని కర్నూల్‌రోడ్ నందు గల ఒక ప్రముఖ విద్యా సంస్థ నందు 1st నుండి 7th క్లాస్ తెలుగు, హిందీ, ఇంగ్లీష్ బోధించుటకు లేడీ టీచర్స్ కావలెను. సంప్ర॥ ✆ 81434 74866, 90324 11611. [O-820795]

■ గిద్దలూరు నందు అది ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటిలో డిగ్రీ / D.Ed. అర్హత గల టీచర్లు -4 మరియు నైట్ డ్యూటీలో ఉండే ఆయామ్మలు-4 కావలెను. ✆ 94409 31182 [O-820787]

■ ప్రముఖ గోల్డ్ ఫైనాన్స్ కంపెనీ నందు టెలికాలర్స్, సేల్స్ & మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. అనుభవం బట్టి సాలరీ కలదు. ఒంగోలు. ✆ 80960 30333 [O-820788]

■ శ్రీ సరస్వతి విద్యాసంస్థలు ఒంగోలు నందు పనిచేయుటకు (M/F) అనుభవం కలిగిన JL'S (అన్ని సబ్జెక్టులకు), వార్డెన్లు, ఫ్లోర్ ఇన్‌ఛార్జిలు కావలెను. సంప్ర॥ ✆ 89191 60963(M), 99488 77258(F). [O-820789]

■ తనిష్క్ షోరూం ఒంగోలు నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్/గ్రీటర్(Female) కావలెను. Q: ఇంటర్/డిగ్రీ మంచి చూడ చక్కని రూపం, వాక్చాతుర్యం కలిగిన వారు తమ పూర్తి బయోడేటాతో షోరూం నందు సంప్రదించగలరు. ✆ 9491708921. [O-820791]

■ కంప్యూటర్ నాలెడ్జ్